ప్రజాశక్తి
శుక్రవారం 25 ఏప్రిల్ 2025 5 అనంతపురం



సాగుభూమికి సోలార్ ఎసరు..!

ఉమ్మడి జిల్లాలో సోలార్ కంపెనీలకు సాగుభూములు కట్టబెట్టే కార్యక్రమం శరవేగంగా సాగుతోంది. రోజుకో మండలంలో కార్పొరేట్ కంపెనీలకు భూములను లీజు పద్ధతిలో ధారాదత్తం చేస్తున్నారు. తాజాగా శ్రీసత్యసాయి జిల్లాలో మరో కంపెనీకి భూముని అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వేలాది ఎకరాలను కార్పొరేట్ కంపెనీలకు కేటాయిస్తూనే పోతున్నారు ఇప్పటికే వేల ఎకరాలు భూకేటాయింపులు సోలార్ కోసమని ఇచ్చారు. తాజాగా మరో కంపెనీకి వేలాది ఎకరాలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చింతా గ్రీన్ ఎనర్జీ అనే సంస్థకు పెద్ద ఎత్తున అనుమతులను ఇచ్చారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



◆ మడకశిర ప్రాంతంలో మరో ప్రాజెక్టు
◆ చింతాగ్రీన్ఎనర్జీకు భూమి
◆ లీజు పద్ధతిలో తీసుకునేలా ప్రభుత్వం అనుమతి

మడకశిర భారీ ప్రాజెక్టుకు అనుమతులు

శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర ప్రాంతంలో భారీ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇస్తూ గురువారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. మడకశిర ప్రాంతంలోని హరేసముద్రం, బుల్ల సముద్రం, ఉప్పర్లపల్లి, కళ్ళుమర్రి, ఎర్రబొమ్మనహళ్లి తదితర గ్రామాల్లో ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులు ఇచ్చింది. 2500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీని మూలంగా ఈ ప్రాంతంలో దాదాపు పదివేల ఎకరాల భూమి అవసరం. అవుతుంది. దీనికి నిర్దిష్టంగా కేటాయింపులు ఎంత అన్నది నిర్ణయించలేదు. లీజు పద్ధతిలో భూములను కంపెనీ సేకరించినందుకు అనుమతులను ప్రభుత్వం ఇచ్చింది. ఏడాదికి 31 వేల చొప్పున లీజు ఉండే విధంగా నిర్ణయించారు. రెండు సంవత్సరాలకు ఒకసారి ఐదు శాతం లీజు పెంచాలని పెంచాలని ఉత్తర్వులు పేర్కొనడం జరిగింది.

ఇప్పటికే పెద్ద ఎత్తున అనుమతులు

సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున అనుమతులు ఇచ్చింది. వేలాది ఎకరాలు ఇందుకోసం కేటాయించారు. ఇంత పెద్ద ఎత్తున భూమిని ఒకే జిల్లాలో కేటాయిస్తుండడం పట్ల విపక్షాల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాబోయే రోజుల్లో జిల్లాలో వ్యవసాయానికి సాగుభూమి కూడా కరువయ్యే పరిస్థితులు నెలకునే అవకాశం ఉందని ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు.

ఆరిన ఇంటిదీపాలు

◆ నీటిమడుగులో పడి ఇద్దరు యువకులు మృతి
◆ చంద్రగిరి గ్రామంలో విషాదం



వంశీ



గోవింద రాజులు

వాళ్లిద్దరూ అన్నదమ్ముల పిల్లలు. ఒకే వయసు వారు కావడంతో ఇద్దరూ కలిసిమెలిసి తిరిగే వారు. వ్యవసాయ కుటుంబాల నేపథ్యంలో ఒకరి పనుల్లో ఒకరు చేదోడువాదోడుగా ఉండేవారు. అన్నదమ్ముల అనుబంధం, స్నేహబంధం కలగలిపి ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. ఇలాంటి వారిని అనుకోని ప్రమాదం వెంటాడింది. ఎద్దులను శుభ్రం చేసేందుకు నీటి ముడుగులోకి వెళ్లిన ఇద్దరు యువకులు ప్రమాదవశాత్తు అందులో మునిగి మృత్యువాత పడ్డారు. ఈ ఘటన రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. చేతికందిన ఇంటిదీపాలు ఆరిపోవడంతో తల్లిదండ్రులు కన్నీటి సంద్రంలో మునిగిపోయారు. బొమ్మనహాల్ మండలం చంద్రగిరి గ్రామంలో గురువారం ఉదయం చోటు చేసుకున్న ఈ విషాద ఘటన గ్రామస్తులను కలచివేసింది.

ప్రజాశక్తి-బొమ్మనహాల్

చంద్రగిరి గ్రామానికి చెందిన చిన్న కుళ్లాయప్ప, పోతప్పలు దాయాది వరుస అన్నదమ్ములు అవుతారు. చిన్న కుళ్లాయప్పకు కుమారుడు గోవింద రాజులు(17), పోతప్పకు కుమారుడు వంశీ(16) ఉన్నారు. గోవిందరాజులు, వంశీ ఇద్దరూ ఎద్దులను శుభ్రం చేసేందుకు గురువారం ఉదయం ఎద్దుల బండితో సహా గ్రామ సమీపంలోని కర్నాటక సరిహద్దు ఎత్తిన భూదేహాల్, చంద్రగిరి గ్రామాల మధ్యన ఉన్న కుంట వద్దకు వెళ్లారు. హెచ్ఎల్సీ ఆధునీకరణ నిమిత్తం మట్టి కోసం దాదాపు 3 ఎకరాల్లో 20 అడుగుల లోతు వరకు ఈ కుంటను తవ్వారు. ఈ కుంటలో ఎప్పుడూ నీరు ఉంటాయి. ఇందులో గోవింద రాజులుకు సంబంధించిన ఎద్దులను శుభ్రం చేసేందుకు ఇద్దరు యువకులు వెళ్లారు. కుంట చివర ఎద్దుల బండిని ఉంచి ఎద్దులకు నీరు తాపడం మొదలు పెట్టారు. ఈ సమయంలో ఇద్దరు యువకులు ఎద్దుల బండిపై ఉన్నారు. నీళ్లు తాగుతున్న ఎద్దులు ఒక్కసారిగా నీటిలోకి ముందుకు పరుగుతీశారు. అక్కడ లోతు అధికంగా ఉండడంతో ఎద్దులతో సహా బండి మునిగిపోయింది. బండిపై ఉన్న ఇద్దరు యువకులు కూడా నీటిలో మునిగిపోయారు. లోతు ఎక్కువగా ఉండడం, బయటకు వచ్చేందుకు ఎద్దుల బండి అడ్డుగా ఉండడంతో నీటిలో ఊపిరాడక విద్యార్థులు గోవిందరాజులు, వంశీలు మరణించారు. అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు అక్కడికి చేరుకుని నీటిలో మునిగిపోయిన ఇద్దరు యువకులను బయటకు తీశారు. వీరితో పాటు ఓ ఎద్దు కూడా మరణించింది. మరణించిన యువకులు ఇద్దరూ ఇటీవల పదవ గరతి పరీక్షలు రాశారు. విఘత జీవులుగా పడి ఉన్న కుమారులను చూసి తల్లిదండ్రులు కన్నీటి పర్యవంతం అయ్యారు. కాగా ప్రమాదం జరిగిన కుంటలో తరుచూ నీట మునిగి పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇప్పటికే ఈ కుంటలో పడి దాదాపు ఆరుగురు మరణించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు స్పందించి ఈ కుంటను పూడ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌తో అవార్డు అందుకుంటున్న కలెక్టర్ వినోద్‌కుమార్

స్వచ్ఛ ఆంధ్రలో అనంతకు అవార్డు

ఉపముఖ్యమంత్రి నుంచి అందుకున్న కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్వచ్ఛ ఆంధ్ర (గ్రామీణ) కార్యక్రమాల అమలులో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డుకు అనంతపురం జిల్లా ఎంపికైంది. ఈ మేరకు మంగళగిరిలో గురువారం నిర్వహించిన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం – 2025 కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డును ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ అందుకున్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఓడిఎఫ్ ప్లస్ కింద స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో పూర్తిస్థాయి నిర్వహించి అన్నింటినీ ఓడిఎఫ్ ప్లస్ మోడల్ గ్రామాలుగా తీర్చిదిద్దడం జరిగింది. స్వచ్ఛ ఆంధ్ర (గ్రామీణ) కార్యక్రమాల నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు అనంతపురం కలెక్టర్‌కు రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డును బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అవార్డును గురువారం నాడు కలెక్టర్‌కు అందించారు.

ప్రయివేట్ కాంప్లెక్స్‌కు విద్యుత్ సరఫరా కట్

ప్రజాశక్తి- బొమ్మనహాల్

మండలంలోని ఉద్దేహాల్ గ్రామంలో నివాసం ఉంటున్న దేవగిరి గ్రామ పంచాయతీ సర్పంచి భర్త రాజకుమార్ కాంప్లెక్స్‌కు గురువారం విద్యుత్ సరఫరా కట్ చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాజకుమార్ కాంప్లెక్స్ ఉన్న మీటర్లకు సంబంధించి రూ. 5.5 లక్షల బకాయితో పాటు జరిమానా కలిపి మొత్తం రూ. 6.2 లక్షల చెల్లించాల్సి ఉండగా చెల్లించకపోవడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరాను తొలగించినట్లు ఆయన తెలిపారు.

కెజిబివిలో ఖాళీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని కెజిబివిలో ఖాళీగా ఉన్న 3 ఖాళీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఇఒ ఎన్.నాగమణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ కుక్-1, స్వీపర్ పోస్టులు-2 ఖాళీలను 2025-26 విద్యా సంవత్సరానికి పొరుగు సేవల ప్రాతిపదికన భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు 'సమగ్ర శిక్ష ఎటిపి.బ్లాక్‌స్పాట్.కామ్' వెబ్‌సైట్‌లో దరఖాస్తు పొంది, అవసరమైన ధ్రువీకరణ పత్రాలు జత చేసి మే 1వ తేదీలోపు రాయదుర్గం ఎంఇఒ కార్యాలయంలో అందజేయాల న్నారు. మరిన్ని వివరాలకు సమగ్ర శిక్ష వెబ్‌సైట్ లేదా ఎంఇఒ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఆటోలకు సీరియల్ నెంబర్ తప్పనిసరి : డీఎస్పీ

కళ్యాణదుర్గం : ఆటోలకు సీరియల్ నెంబర్ తప్పనిసరి డీఎస్పీ రవిబాబు ఆదేశించారు. డీఎస్పీ మాట్లాడుతూ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండే ప్రతి ఆటోకు వెనుక, ముందు పోలీస్ స్టేషన్‌లో ఇచ్చే సీరియల్ నెంబర్‌ను(స్టిక్కరింగ్) వేయించాలన్నారు. ఇందుకు పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటికే ఆటోలకు నెంబర్ ఉంటే అదే నెంబర్‌ను పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయించాలన్నారు. మరిన్ని వివరాలకు కానిస్టేబుల్ షఫీ నెంబర్ 90527 96786కు ఫోన్ చేయాలన్నారు. ప్రతి ఆటో డ్రైవర్ యూనిఫాం ధరించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు ఉంటే పోలీస్ వారే లైసెన్స్ వచ్చేలా ఏర్పాట్లు చేస్తారన్నారు. డీఎస్పీతో పాటు పట్టణ సిఐ యువరాజు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సమస్యల వలయంలో సచివాలయాలు..!


◆ శిథిల భవనాలు.. భయంలో ఉద్యోగులు..
◆ కనీస సౌకర్యాలు కరువు
◆ పట్టించుకోని ప్రభుత్వాలు

ప్రజాశక్తి-గుత్తి

గుత్తిలో సచివాలయాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. కనీస సౌకర్యాలు లేక అక్కడ పనిచేసే ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుత్తి మున్సిపాలిటీ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ, అద్దె భవనాల్లో సచివాలయాల నిర్వహణ కొనసాగుతోంది. మున్సిపాలిటీ పరిధిలో 25వార్డులు ఉండగా 12 సచివాలయాలు, మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా 13 సచివాలయాలను అధికారులు ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాలు కావడంతో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు వెచ్చించి 13 గ్రామ సచివాలయాలకు నూతన భవనాలను నిర్మించారు. నిర్మాణాలు పూర్తయినా ఇప్పటికీ కొన్ని గ్రామ పంచాయతీల్లో భవనాలు ప్రారంభం కాలేదు. 25 సచివాలయాల్లో దాదాపు 210 ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి సచివాలయంలో అడ్మిన్, విద్యా కార్యదర్శి, సంక్షేమ కార్యదర్శి, ఇమ్యూనిటీ కార్యదర్శి, ప్రణాళిక కార్యదర్శి, మహిళా పోలీస్, ఎఎన్ఎం, శానిటేషన్ కార్యదర్శి, వీఆర్వో పనిచేస్తున్నారు. గతంలో అన్ని సచివాలయాలకు జూనియర్ లైన్‌మెన్లు కూడా ఉండేవారు. ప్రస్తుతం వారందరూ ఏపీ ఎస్పీడీసీఎల్‌కు వెళ్లిపోయారు. మున్సిపాలిటీ పరిధిలోని 12 సచివాలయాలకు సంబంధించి 104 మంది సచివాలయ ఉద్యోగులు ఉండగా అందులో 55 మంది మహిళా ఉద్యోగులు, 41 మంది పురుషులు విధుల్లో ఉన్నారు. చెట్నేపల్లిలోని 1వ సచివాలయం, ఎస్ఎస్ పల్లి 2వ సచివాలయం, తోళ్ల షాపు ఏరియాలో ఉన్న 4వ సచివాలయం, కొత్తూరులో ఉన్న 5వ సచివాలయం, కోట ప్రాంతంలోని 7వ సచివాలయం, జంగాల కాలనీలోని 9వ సచివాలయం, బీసీ కాలనీలో ఉన్న 12వ సచివాలయాలు అద్దె భవనాల్లో నిర్వాహణ కొనసాగిస్తున్నారు. వాటికి ప్రతినెల రూ.39,620 అద్దెను మున్సిపల్ అధికారులు చెల్లిస్తున్నారు. 5 సచివాలయాలను ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్నారు.



10వ సచివాలయంలో శిథిలమైన మరుగుదొడ్ల



పెచ్చులూడిన సచివాలయం భవనం పైకప్పు

కనీస సౌకర్యాలు కరువు

సచివాలయాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. 10వ సచివాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఎన్నో ఏళ్లుగా నిర్మించిన భవనంలో సచివాలయాన్ని నిర్వహిస్తున్నారు. పలు గదులు పైకప్పు పెచ్చులు ఊడి కింద పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో సురక్షితంగా బయటపడ్డారు. ప్రస్తుతం ఒకే గదిలో సచివాలయాన్ని కొనసాగిస్తున్నారు. అక్కడ గతంలో ప్రభుత్వ బాలుర వసతిగహం ఉండేది. అప్పుడు నిర్మించిన మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. అన్ని సచివాలయాల్లో తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకు గదులు, గాలి, వెలుతురు లేని సచివాలయాలు ఉన్నాయి. సచివాలయాల్లో మరుగుదొడ్లు లేవు. పలు సచివాలయ భవనాలు వర్షాలు వస్తే కారుతున్నాయి. దీంతో సచివాలయ ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. వివిధ సచివాలయాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు కొన్ని పూర్తిగా పాడైపోయాయి. ఉన్నవి అరకొరగా పనిచేస్తున్నాయి. ప్రింటింగ్‌కు సంబంధించి సొంతంగా ఉద్యోగులే పేపర్లను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఆన్‌లైన్‌కు సంబంధించి వైఫై నెట్ లేకపోవడంతో ఉద్యోగులు వారి సెల్‌ఫోన్‌లోని నెట్ ద్వారా కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. సాంకేతిక సమస్యల నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వ ఆదేశాలతో 19 సర్వేలు చేయలేక సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


కనీస సౌకర్యాలు కల్పిస్తాం

మున్సిపాలిటీ పరిధిలోని 12 సచివాలయాల్లో కనీస సౌకర్యాలు కల్పిస్తాం. సచివాలయాల్లో కంప్యూటర్లు అదనంగా ఉన్నాయి. 10వ సచివాలయ భవనం శిథిలావస్థలో ఉన్న నేపథ్యంలో ఇతర ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం.

బి.జబ్బార్ మియా,
మున్సిపల్ కమిషనర్, గుత్తి.

మార్కెట్ యార్డ్‌లో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న విప్ కాలవ

పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద ఎఎంసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని గురువారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చటానికి మార్కెట్ యార్డ్ నిర్వాహకులు చలివేంద్రం ఏర్పాటు చేయడంపై ప్రశంసించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొడిసెలపల్లి హనుమంతరెడ్డి, మార్కెట్ యార్డ్ కార్యదర్శి శ్రీనివాసులు, వ్యాపారులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోండి : ఎస్ఎఫ్ఐ



విలేకరులతో మాట్లాడుతున్న బంగి శివ

ప్రజాశక్తి-రాయదుర్గం

ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలపై విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నియోజవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు గత పది రోజుల నుంచే విస్తృత ప్రచారం చేస్తున్నాయన్నారు. దీనికి తోడు ఇటీవల పదో తరగతి ఫలితాలు వెలువడ డంతో ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల మార్కులతో కూడిన కరపత్రాలను పంచుతూ తల్లిదండ్రులను ప్రలోభ పెట్టి ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. అలాగే క్రీసెంట్, నారాయణ పాఠశాలల్లో 9వ తరగతి విద్యార్థులకు ముందుగానే పదో తరగతి పుస్తకాలు విక్రయించడం ఏంటని ప్రశ్నించారు. తక్షణమే డిఇఒ, ఎంఇఒలు స్పందించి నియోజవర్గ వ్యాప్తంగా ఉన్న ముందస్తు అడ్మిషన్లు సేకరిస్తున్న ప్రయివేటు, కార్పొరేట్ స్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిచో ఆయా పాఠశాలల ఎదుట ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అనిల్, విష్ణు, ఇర్ఫాన్, లోకేష్, సాయి, గణేష్ పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన శెట్టూరు జడ్పిటిసి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్



జగన్‌తో శెట్టూరు జెడ్పీటీసీ మంజునాథ్

వైసిపి అధినేత జగన్‌ను గురువారం శెట్టూరు మండల జడ్పిటిసి అయ్యగార్లపల్లి మంజునాథ్ తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగన్ కళ్యాణదుర్గం నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిణామాలపై ఆరా తీసినట్లు సమాచారం. పార్టీని మరింత బలోపేతం చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని, మీకు అండగా ఉంటానని జగన్ తెలిపినట్లు ఆయన తెలిపారు.

రేషన్ సరుకులు పారదర్శకంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ప్రభుత్వం నుంచి చౌకదుకాణాల ద్వారా రేషన్‌కార్డుదారులకు అందాల్సిన బియ్యం, కందిబేడలు, రాగులు, చక్కెర, తదితర నిత్యావసర సరుకులను డీలర్లు పారదర్శకంగా పంపిణీ చేయాలని తహశీల్దార్ బాలకిషన్ ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం రేషన్ డీలర్లతో సమా వేశం నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ నియమ నిబంధనలను అనుసరించి ప్రతి కార్డుదా రునికి న్యాయం చేయాల్సిన బాధ్యత డీలర్లు, ఎండియు ఆపరేటర్లపై ఉందన్నారు. సమావేశంలో సిఎస్‌డిటి రాజశేఖర్, స్టాకిస్ట్ మహబూబ్‌బాషా, మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు రఫీ, డీలర్లు పాల్గొన్నారు.

శ్రీరామిరెడ్డి కార్మికుల పోస్టుకార్డు ఉద్యమం



పోస్టుకార్డులను పంపుతున్న శ్రీరామిరెడ్డి కార్మికులు

కళ్యాణదుర్గం రూరల్ : పెండింగ్ వేతనాలు, పిఎఫ్ చెల్లించాలని కోరుతూ శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా కార్మికులు చేస్తున్న సమ్మె గురువారం 19వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులు, అధికారులకు పోస్టుకార్డు ద్వారా సమస్యలను పంపారు. ప్రభుత్వం స్పందించి వెంటనే కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బిహెచ్.రాయుడు, మండల అధ్యక్షుడు రంగనాథ్, శ్రీరామ్ రెడ్డి యూనియన్ జిల్లా కోశాధికారి వన్నూరుస్వామి, నరేష్, రమేష్, అల్లా బకాస్, గురుమూర్తి, హనుమంత్ రెడ్డి పాల్గొన్నారు.

సబ్‌జైలు తనిఖీ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

పట్టణంలోని సబ్ జైలును గురువారం డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ శివప్రసాద్ యాదవ్ సందర్శించారు. ఆయన జైలులోని బ్యారెక్కులు, బాత్‌రూములు, టాయిలెట్లు, స్టోర్‌రూమ్, వంటగదిని పరిశీలించారు. జైలులో అందుతున్న సదుపాయాలపై ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలందరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. సత్ప్రవర్తనతోనే జీవితంలో మార్పు వస్తుందన్నారు.

ఉగ్రదాడిలో మృతులకు నివాళి

ప్రజాశక్తి-రాయదుర్గం



కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న వైసిపి నాయకులు

జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన భారత పౌరులకు టిడిపి ఆధ్వర్యంలో నివాళు లర్పించారు. ఉగ్రదాడిలో మృతుల ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ గురువారం పట్టణంలోని 1వ వార్డులో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అధ్యక్షతన ఆ పార్టీ కార్యకర్తలు మౌనం పాటించారు. భారత పర్యాటకులపై ఉగ్రవాదుల దుశ్చర్యను కాలవ తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఇది పిరికిపందె చర్యగా అభివర్ణించారు. భారత్ ఎప్పుడూ ప్రపంచ శాంతినే కోరుకుంటుందన్నారు.

తాలూకా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఖండన

పహల్గామ్‌లో ఉగ్రవాదులు చేసిన దాడిని తాలూకా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద తాలూకా పాస్టర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ పహల్గామ్‌లో ఉగ్రదాడి అమానవీయమన్నారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. దేశంలోని అన్ని మతాలు, అన్ని వర్గాల ప్రజలు ఐక్యతతో ఉగ్రవాదాన్ని ఎదురిం చాలని పిలుపునిచ్చారు. దాడిలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని, మృతుల కుటుంబ సభ్యులకు ధైర్యం ప్రసాదించాలని ప్రార్థిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు ఐజక్ శామ్యూల్, శామ్యూల్, జె.కిరణ్ కుమార్, ప్రేమ్‌కుమార్, జయచంద్రబాబు, ఆనంద్, పాల్, పాస్టర్ రవిశేఖర్ బాబు, డేవిడ్, విల్సన్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ..

పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడులకు నిరసనగా వైసిపి ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహం నుంచి వినాయక కూడలి వరకూ కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. శాంతి ర్యాలీలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, నాయకులు గౌని ఉపేంద్రరెడ్డి, మాధవరెడ్డి, శివ, గోవిందు, కౌన్సిలర్లు శారద, శ్రీలక్ష్మి, లావణ్య, గోవిందరాజులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

అంగన్‌వాడీ నాయకురాలు పద్మావతికి నివాళి



నివాళులర్పిస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

సిఐటియు అనుబంధ అంగన్వాడి యూనియన్ దివంగత నాయకురాలు డి.పద్మావతి వర్ధంతిని పురస్కరించుకుని సిఐటియు, సిపిఎం ఆధ్వర్యంలో గురువారం నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, సిఐటియు పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు, సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్ మాట్లాడుతూ దివంగత పద్మావతి 2006 నుంచి సిపిఎం సభ్యులుగా, అంగన్వాడీ యూనియన్, ఐద్వా మహిళా సంఘం నాయకురాలుగా మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేశారన్నారు. ఆమె లేని లోటు పూడ్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు రంగమ్మ, పట్టణ కమిటీ సభ్యులు డి.శ్రీనివాసులు, సూరి, షాషా, తిమ్మప్ప, మక్బూల్, తదితరులు పాల్గొన్నారు.

కెఎస్ఆర్ విద్యార్థిని ప్రతిభ

టెన్త్‌లో 592 మార్కులు



ప్రతిభ కనబరిచిన చోలా గోస్‌పాజ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పదో తరగతి 2025-26 విద్యా సంవత్సరం ఫలితాల్లో కాశంశెట్టి షాకుంతలమ్మ గారి రాధాకృష్ణయ్య (కెఎస్ఆర్) ప్రభుత్వ బాలికల హైస్కూల్ అనంతపురం విద్యార్థిని చోలా గోస్‌పాజ 592 మార్కులు సాధించి ప్రతిభ చాటింది. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని ఫలితాలు సాధించడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేసింది. బాగా చదువుకోవడానికి తమ అమ్మ ఎంతో కష్టపడిందన్నారు. దీనికితోడు పాఠశాలలో చేర్పించి.. ప్రోత్సహించిన తాతయ్య ఎంతో స్ఫూర్తినిచ్చారన్నారు. పాఠశాల ఉపాధ్యాయుల బోధన, మా కుటుంబ సభ్యుల ప్రోత్సాహం గొప్పదన్నారు. తాను ఇన్ని మార్కులు సంపాదించడానికి వారందరి ఆదరణతోనే సాధ్యమైందన్నారు. మునుముందు ఇదే ప్రోత్సాహంతో ఉన్నత చదవులు చదివి యోమగామిగానీ, పైలట్‌గానీ కావాలని కోరిక ఉన్నట్లు తెలిపారు.

బాల్య వివాహాలపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-ఉరవకొండ

మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి వెంకటేష్‌నాయక్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, టీనేజ్ ప్రెగ్నెన్సీస్ రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ అమ్మాయిలకు 18, అబ్బాయిలకు 21ఏళ్లు నిండాకే పెళ్లి చేయాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల అమ్మాయిలు చదువు, ఆరోగ్యం పాడవుతాయని తెలిపారు. బాల్య వివాహాలు వలన టీనేజ్ ప్రెగ్నెన్సీస్ రావడం వల్ల పుట్టబోయే పిల్లలపై కూడా ప్రతికూల ఆరోగ్య ప్రభావం పడేఅవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నాగరంగయ్య,హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, హెల్త్ సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, స్టాఫ్‌నర్సులు, ఫార్మసీ ఆఫీసర్ మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలో పంటలు సాగు చేసి ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రైతుసంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వీటి రామాంజనేయులు, రైతుసంఘం పుట్లూరు కార్యదర్శి సత్తార్ గోపాల్‌యాదవ్, మండల అధ్యక్షుడు ఎన్.గోపాలకృష్ణ, మాట్లాడుతూ గతనెల 22వ తేదీ సాయంత్రం మండల వ్యాప్తంగా కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలులకు ఉద్యానవన పంట లు సాగు చేసిర రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. వారందరినీ ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళనలను చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో రైతుసంఘం నాయకులు చిన్నకుళ్లాయప్ప, బి.చిన్నకృష్ణుడు యాదవ్, మండల కమిటీ నాయకులు బి.ఓబుల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి ఆరాధన దినోత్సవం

ఉరవకొండ : సత్యసాయి బాబా ఆరాధన దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో స్వామి తమ అవతారాన్ని ప్రకటించిన దివ్యక్షేత్రంలో గురువారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజామున ఓంకారం, సుప్రభాత సేవ, భక్తుల నగర సంకీర్తన, స్వామివారికి షోడశోపచార అష్టోత్తర పూజలు చేశారు. మధ్యాహ్నం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో 54 మంది రోగులకు ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ కుముద ఆహార పొట్లాలు పంపిణీ చేశారు.

పేద కుటుంబానికి నిత్యావసరాలు పంపిణీ

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో గురువారం పేద కుటుంబానికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలమురళి మాట్లాడుతూ నగరంలోని జిల్లా కోర్టుకు ఎదురుగా ఉన్న వీధిలో మోలార్లు మెకానిక్ మురళి రోడ్డు ప్రమాదంలో కాలు పూర్తిగా కోల్పోయి మంచానికి పరిమితమయ్యాడు. ఇతనికి భార్య లక్ష్మి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకుని రెండు నెలలకు సరిపడ 35 రకాల నిత్యావసర సరుకులు, బియ్యం ప్యాకెట్‌తోపాటు మురళి పడుకోవటానికి వీలుగా ఎయిర్ బెడ్‌ను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సాయిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



జగన్‌తో బండి కిరణ్‌కుమార్

జగన్‌ను కలిసిన బండి కిరణ్ కుమార్

అనంతపురం : వైసిపి రాష్ట్ర పంచాయతీ విభాగం కార్యదర్శిగా ఎన్నికైన బండి కిరణ్‌కుమార్ వైసిపి అధినేత జగన్‌ను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని జగన్ సూచించారు. ఎన్నికకు సహకరించిన పార్టీ పెద్దలకు ప్రతి ఒక్కరికీ కిరణ్ ధన్యవాదాలు తెలిపారు. రాబోవు ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడానికి తన శక్తివంతం లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

ఆర్డీటీ నిధులను అడ్డుకోవడం బాధాకరం

ఎపి వ్యకాసం, రైతుసంఘం నాయకులు



విలేకరులతో మాట్లాడుతున్న ఎపి వ్యకాసం, రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురంకలెక్టరేట్

జిల్లాలోని పేదల వరప్రధాయినిగా ఉన్న ఆర్డీటీ సంస్థకు విదేశీ నిధులను కేంద్ర ప్రభుత్వం అడ్డుకోవడం బాధాకరమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ 1969 నుంచి కరువు పీడితమైన అనంతపురం జిల్లాలో బడుగు, బలహీన వర్గాలు, దళిత గిరిజనులకు తిండి, విద్య, వైద్యం, ఇళ్లు, ఆటల పోటీలు, క్రీడాకారులుగా, పిల్లల టాలెంట్ ను గుర్తించి వారి అభివృద్ధి కోసం శిక్షణలు, ఉన్నత విద్య, మహిళలు, వికలాంగుల అభివృద్ధికి ఎన్నో సేవలు చేస్తోందన్నారు. బత్తలపల్లి, కళ్యాణదుర్గం, కణేకల్లు మండలాల్లో ఆసుపత్రులు ఏర్పాటు చేసి పేదలకు మెరుగైన వైద్యం అందిస్తోందన్నారు. ఇలాంటి సంస్థకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎఫ్‌సిఆర్ఎ (ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్) రెన్యూవల్ చేయకుండా నిలిపివేయడమంటే పేదల అభివృద్ధిని అడ్డుకోవడమే అన్నారు. బిజెపి ప్రభుత్వం కేంద్రంలో మూడవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, ముస్లిములు, క్రైస్తవులు, స్వచ్ఛంద సంస్థలపై పెద్ద ఎత్తున దాడులు చేస్తోందన్నారు. ఆర్డీటీ ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించా లని డిమాండ్ చేస్తూ ఈనెల 27న ఆదివారం ఎపి పెన్షనర్స్ భవన్‌లో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున ఈ సమావేశానికి ప్రజా, దళిత, రైతు, కార్మిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు మేధావులు హాజరై తమ విలువైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాంతక వ్యాధులపై అవగాహన అవసరం

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఇబి దేవి

ప్రజాశక్తి-అనంతపురం

మలేరియా, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి రక్షణ కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఇబి దేవి సూచించారు. గురువారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి కార్యాలయంలో ఏప్రిల్ 25వ తేదీ నిర్వహించనున్న ప్రపంచ మలేరియా దినోత్సవానికి సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య, మున్సిపల్, గ్రామ పంచాయతీ సిబ్బంది పరస్పర సహకారంతో వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా మలేరియా, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా మలేరియా అధికారి ఓబులు మాట్లాడుతూ ఫ్రైడే డ్రైడే, వెక్టార్ కంట్రోల్ హైజిన్ కార్యక్రమాలను చక్కగా నిర్వహించి అందరిలో మార్పు వస్తే మలేరియా అంతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎఫ్‌డిపి నోడల్ ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి, ఎన్‌హెచ్ఎం మేనేజర్ కిషోర్, సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, ఇన్‌ఛార్జి మాస్ మీడియా అధికారి త్యాగరాజు, డిప్యూటీ హెచ్ఇఒ గంగాధర్, అనంతపురం మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, అబ్దుల్ మునాఫ్, గిరిధర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు శ్రీధర్‌మూర్తి, నూర్‌బాషా, రమేష్, లోకేశ్వర్‌రెడ్డి, రాఘవేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.రామాంజనేయులు



పోస్టర్లను విడుదల చేస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

గతంలో ఉన్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఈనెల 25తేదీన కలెక్టరేట్ ముందు నిర్వహించనున్న ధర్నాకు సంబంధించిన కరపత్రాలను మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి హయాంలో అటకెక్కించిన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును తాము అధికారంలోకి వస్తే పునరుద్ధరిస్తామని కూటమి నాయకులు ఎన్నికల ముందు హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి పదినెలలు కావస్తున్నా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కావున ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25వతేదీన కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున ధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్, కార్మికులు సునీల్, తిరుపతయ్య, సుబ్బరాయుడు, ఆదినారాయణ, బాషా, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయవాది రామ్‌కుమార్

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

న్యాయవాది రామ్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రతి ఒక్కరూ విధిగా పుస్తక పఠనాన్ని అలవర్చుకుంటే సమాజానికి అవసరమైన విలువైన సమాచారం దొరుకుందని న్యాయవాది రామ్‌కుమార్ సూచించారు. జన విజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని పిటిసి మైదానంలోని గేటు వద్ద ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన గురువారం కూడా కొనసాగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ఒక మహామేధావి, మహాజ్ఞాని మన మధ్యన లేకపోవచ్చుగాని వారు అందించిన మహత్తరమైన సమాచారం పుస్తకాలో దాగి ఉంటుందన్నారు. పుస్తకం ఎప్పుడూ ఒక మంచి నేస్తంగా ఉండాలన్నారు. జెవివి రాష్ట్ర నాయకులు సాకే భాస్కర్ మాట్లాడుతూ వేసవి సెలవులలో విద్యార్థులు ఆటలతో పాటు పుస్తకాలు చదువుకోవడానికి కూడా సమయాన్ని కేటించాలని అప్పుడే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వ్యాయామం కోసం పిటిసి గ్రౌండ్‌కు వస్తున్న నగరవాసులు పుస్తకాలు కొనడానికి ఆసక్తి చూపిస్తున్నారనితెలిపారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు విరూపాక్షి, వీరరాజు, తిరుపాలు, ప్రసాద్‌రెడ్డి, ముత్యాలు, ఎర్రిస్వామి, రాజశేఖర్, రాజేష్ పాల్గొన్నారు.

హక్కులు, చట్టాలపై అవగాహన అవసరం



పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-గుత్తి

బాలల హక్కులు, చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బాలల పరిరక్షణ సంస్థ జిల్లా రక్షణాధికారిణి ఎం.వెంకటేశ్వరి అన్నారు. గురువారం పట్టణంలోని గుత్తి మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం హాండ్స్ స్వచ్ఛంద సంస్థ, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో బాలల హక్కులు, బాల్యవివాహాల నిరోధం, ఫోక్సో చట్టం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే అనేక అనర్థాలకు దారితీస్తాయన్నారు. వేసవి సెలవుల కారణంగా చిన్నపిల్లలకు ప్రమాదాలు జరగకుండా తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే సైబర్ నేరాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం అరుణకుమారి, హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ వి.నాగలక్ష్మి, సీసీలు రామలింగం, నాగరాజు, రంగనాయకులు, మీనా, ఎంఎస్ఒబి చాంద్‌బీ, లక్ష్మీ, విజయలక్ష్మి ఎంఎస్ఎ మంజుల, గ్రామ సమైక్య నాయకురాళ్లు, తదితరులు పాల్గొన్నారు.

30లోపు ఇకెవైసి చేయించుకోండి

పుట్లూరు : మండలంలోని ప్రజలు ఈనెల 30వ తేదీలోపు ఇకెవైసి చేయించుకోవాలని తహశీల్దార్ శేషారెడ్డి గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఇకెవైసి చేయించుకోవాల్సిన వారు సంబంధిత స్టోర్ డీలర్లు, సచివాలయం, విఆర్ఒల వద్దగానీ చేయించుకోవచ్చన్నారు.

పెద్దపప్పూరు : మండల వ్యాప్తంగా రేషన్ కార్డు లబ్ధిదారులు ఈనెల 30వ తేదీలోపు తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని తహశీల్దార్ బాలాజీరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇకెవైసి చేయించుకోకపోతే రేషన్ ఇవ్వరన్నారు. కావున తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలన్నారు.

వితంతు పింఛన్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

పుట్లూరు : వితంతు పింఛన్ కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ అలివేలమ్మ గురువారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలో 1-12-23 నుంచి 31-4-24 తేదీ వరకూ భర్తలకు పింఛన్ వస్తూ మృతిచెందిన వారి భార్యలు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

సబ్సిడీ రుణాలు మంజూరు

పుట్లూరు : మండలానికి 9 సబ్సిడీ ఎస్‌సీ రుణాలు మంజూరైనట్లు ఎంపిడిఒ అలివేలమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పుట్లూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుకు 3, ఎ.కొండాపురం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకుకు 3, నార్పల మండలం గూగూడు, నార్పల, తాడిపత్రి బ్యాంకులకు ఒక్కొక్కటలి చొప్పున మంజూరైనట్లు ఎంపిడిఒ తెలిపారు. మే నెల 10వ తేదీలోపు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

చలివేంద్రం ఏర్పాటు

పుట్లూరు : వేసవిని దృష్టిలో ఉంచుకుని గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎంపిడిఒ కార్యాలయానికి వచ్చే సిబ్బందితోపాటు ప్రజల సౌకర్యార్థం తాగునీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

గుత్తి : భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ కూడలిలో విద్యార్థులు, రైతులు, ప్రజలకు గురువారం గుత్తిలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి మండల కన్వీనర్ ఎంవి రమణ మాట్లాడుతూ సత్యసాయి బాబా 150 దేశాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. సత్యసాయి బాబా శత జయంతిని పురస్కరించుకుని తమ వంతు సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి గౌరవ సలహాదారు సూర్యనారాయణ రెడ్డి, భగవాన్ శ్రీ సత్య సాయి సేవ సమితి సభ్యులు నారాయణ, రాజేంద్ర కుమార్, అనిత, శ్రీదేవి, భారతీదేవి, ఉషా, వసుంధరమ్మ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ కార్డులు పంపిణీ

శింగనమల : ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో టిడిపి సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత మాజీ కార్యదర్శి మాసూలు చంద్రమోహన్, ఆయకట్టు ప్రెసిడెంట్ సత్యనారాయణ, సీనియర్ నాయకులు వెంకటేష్, పెద్ద నాగముణి, బెస్త పాపన్న, బెస్త శంకర్, మాసూల ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన

డి.హీరేహాల్ : మండల పరిధిలోని తిమ్మాలాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రసన్న ఆంజనేయస్వామి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విప్ కాలవ శ్రీనివాసులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం మార్కెట్ యార్డు ఛైర్మన్ హనుమంతురెడ్డి, సోమవాపురం ఎంపిటిసి మొండి మల్లికార్జున, అంగడి రాజశేఖర్, కురుబ శేఖర్, నాగలాపురం మాజీ ఎంపిటిసి వెంకటేశులు, తిమ్మయ్య, తలారి నారాయణస్వామి, బి.సంగప్ప, తిమ్మాలాపురం రాజేష్, సురేంద్ర, కురుబ బొజ్జప్ప పాల్గొన్నారు.

కాశ్మీర్‌లో ఉగ్రదాడి బాధాకరం

ఉరవకొండ : జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి ఎమ్మెల్సీ, శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్ వై.శివరామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో నివాళులర్పించారు. ఉగ్రదాడిలో 28 మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. హింస ఏ రూపంలోనూ ఆమోదయోగ్యం కాదన్నారు. అమాయకుల ప్రాణాలు తీయడం హేయమైన చర్యల అన్నారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

గేట్స్‌లో పాలిసెట్ మోడల్ పరీక్ష

గుత్తి : గేట్స్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 26న పాలిసెట్ మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు కళాశాల యాజమాన్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్ ద్వారా ఇంజనీరింగ్ స్ట్రీమ్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశించే విద్యార్థులకు ఈ మోడల్ పరీక్ష సులభతరంగా ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు గ్రేట్ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే మోడల్ పరీక్షకు హాజరు కావాలన్నారు.

బస్‌షెల్టర్ ఏర్పాటుకు వినతి

నార్పల : మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద శాశ్వత బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని జనసేన నాయకులు కోరారు. ఈమేరకు గురువారం పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో జనసేన మండల కన్వీనర్ గంజిగుంట రామకృష్ణ, మైనారిటీ నాయకులు రహంతుల్లా, వినోదం లోకేష్, జనసైనికులు పాల్గొన్నారు.

27న క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

అనంతపురం : రాష్ట్రీయ ఆయూష్ మెడికల్ అసోసియేషన్, ఆర్య వైద్య ఫార్మసీ కోయంబత్తూరు ఆధ్వర్యంలో ఈనెల 27వతేదీన నగరంలోని రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న శ్రేయాస్ గ్రాండ్‌లో అవగాహన సదస్సు నిర్వహినంచనున్నట్లు రాష్ట్రీయ ఆయూష్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా న్యాయమూర్తి టి.హరిత, ఎస్‌కెయు ప్రొఫెసర్ మురళీధర్ రావు, తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పుట్లూరు : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తాడిపత్రి గ్రామానికి చెందిన సుధాకర్ (56) ఈనెల 19న తెల్లవారుజామున తాడిపత్రి నుంచి తక్కల్లపల్లి గ్రామానికి ద్విచక్ర వాహనంలో పాలు తీసుకెళ్లేందుకు ద్విచక్ర వాహనంలో వచ్చి అదుపు తప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరిలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గురువారం కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మొక్కజొన్న గడ్డి, డ్రిప్పు పరికరాలు దగ్ధం

రాయదుర్గం రూరల్ : గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మొక్కజొన్న గ్రాసం, డ్రిప్పు, స్ప్రింక్లర్లు కాలిపోయిన సంఘటన గురువారం మండలంలోని మెచ్చిరి గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత రైతు కరణం విఠల్ తెలిపిన వివరాలు.. అనారోగ్యం కారణంగా బుధవారం పొలానికి వెళ్లలేదని, గురువారం పొలం లోకి వెళ్లి చూడగా డ్రిప్పు, స్ప్రింక్లర్ల పరికరాలతో పాటు మొక్కజొన్న గ్రాసం కాలి బూడిదైందన్నారు. గుర్తుతెలియని వ్యక్తులెవరో ఉద్దేశపూర్వకంగానే నిప్పు పెట్టారని, దీంతో రూ. 45 వేల దాకా నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశానన్నారు.

'ఉపాధి' కూలీకి పాముకాటు

బొమ్మనహాల్ : ఉపాధి హామీ పనులకు వెళ్లిన మహిళా కూలీ పాముకాటుకు గురైన సంఘటన గురువారం మండలంలోని గోనేహాల్‌లో చోటుచేసుకుంది. ఎంపిడిఒ విజయభాస్కర్ తెలిపిన వివరాలు.. ఉపాధి హామీ పనుల్లో భాగంగా కురుబ నాగవేణి ఉదయం 7 గంటల సమయంలో కాలువ మరమ్మతులు చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన పాము కాలికి కాటేసింది. దీంతో తోటి కూలీలు ఆమెను 108 సాయంతో వెంటనే కణేకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యుతు చికిత్స చేశారు. ఆమెతో పాటు ఈవోపిఆర్‌డి దేవదాస్, ఉపాధి హామీ పథకం మేటి ఉన్నారు.

ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం



జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో మాట్లాడుతున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

నగరంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న డిపిఆర్‌సి సమావేశ మందిరంలో జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కాశ్మీర్‌లో ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి నివాళులర్పించారు. అనంతరం జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థకు రాజ్యంగ ప్రతిపత్తి కల్పించిన తర్వాత ఏప్రిల్ 24న అమలులోకి వచ్చిందన్నారు. గ్రామ పంచాయితీలే ప్రజాస్వామ్యానికి హృదయమని నమ్మిన గాంధీ గ్రామస్వరాజ్యం ఆలోచనలను మన ముందు ఉంచారన్నారు. తర్వాత ఉమ్మడి జిల్లాలలో పంచాయతీ రాజ్ వ్యవస్థలో భాగమై ఉత్తమ సేవలు అందించిన సర్పంచులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి వెంకట సుబ్బయ్య, డిపిఒ కార్యాలయ పరిపాలనాధికారి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గాంధీజీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు నివాళు ర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ పర్యవేక్షకురాలు ఉమాదేవి, సీనియర్ అసిస్టెంట్ నూర్ మొహమ్మద్, జూనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి, టైపిస్ట్ జగన్నాథ్‌రెడ్డి, ఎపిఒలు ఎర్రమ్మ, రమేష్ రామారావు, టెక్నికల్ అసిస్టెంట్లు, కార్యాలయ సహాయకులు మోహన్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అలాగే మండలంలోని బొందలవాడ గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో వైస్ సర్పంచు అలం వెంకట నరసానాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల వద్దకే పాలన అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఉరవకొండ : పంచాయతీల ద్వారానే గ్రామాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేసి అభివృద్ధి జరుగుతోందని సర్పంచు జగదీష్ అన్నారు. గురువారం వజ్రకరూరు మండలం చాబాల పంచాయతీ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఎర్రిస్వామి, బండారు పరంధామ, అంబేద్కర్ గురుకుల పాఠశాల వైస్‌ఛైర్మన్ మండల చంద్రశేఖర్, స్టోర్ డీలర్ నరసింహులు, రాంబాబు, మూర్తి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వీఆర్వో సురేంద్ర, డిజిటల్ అసిస్టెంట్ జ్యోతి, విలేజ్ సర్వేయర్ భాను, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రమోద్, వీఆర్‌ఏ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ తేజోష్ణ ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతిభ కనబరిచిన ఆరుగురు ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి జి.విశాలాక్షి మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అధికంగా నిధులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి శివాజీరెడ్డి, సర్పంచి చిదంబరి, ఎంపిటిసి చిన్న వీరన్న గౌడ్, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థినికి అభినందన



విద్యార్థినిని సన్మానిస్తున్న దృశ్యం

పుట్లూరు : పదో తరగతి ఫలితాల్లో 568 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన ఎపి మోడల్ స్కూల్ విద్యార్థిని వి.అక్షయను గురువారం మండల విద్యాశాఖ కేంద్రంలో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు శ్రీదేవి, ప్రేమ్‌కుమార్, పాఠశాలల ప్రిన్సిపాల్, ఓబుల్‌రెడ్డి, పాఠశాల కమిటీ ఛైర్మన్ నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని సత్తా

అనంత మండల టాపర్‌గా వి.తరణి



అనంతపురం : పదో తరగతి ఫలితాల్లో అనంతపురం మండలం పాపంపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని వి.తరణి 570 మార్కులు సాధించి మండల టాపర్ నిలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా తరణితోపాటు అదిలాఖనం 567, వి.మంజుల 562, అబిదా 553, కె.శ్రావణి 551, ఇందుమతి 545, వి.కార్తీక్ 537 మార్కులు సాధించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు తినిపించి తమ ఆనందాన్ని ఉపాధ్యాయులతో పంచుకున్నారు.

12ఏళ్ల తర్వాత వనభోజనం

పుట్లూరు : మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో 12ఏళ్ల తర్వాత ఎస్సీ కాలనీవాసులు వనభోజనాలకు వెళ్లారు. ఇందులో భాగంగా తమ ఇళ్లు, వాకిళ్లను శుభ్రం చేసుకుని వంట సామగ్రితో గ్రామ సమీపంలోని పొలిమేర పెద్దమ్మతల్లి ఆలయం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడే వంట చేసుకుని ఆరగించారు. సాయంత్రం తిరిగి గ్రానికి చేరుకున్నారు.